## క్లుప్తంగా

### అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

**పెనుమంట్ర:** మార్టేరు తోకపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపీటీసీ సభ్యురాలు కర్రి అనురాధ జోగిరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టీ పరిశీలించి, అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరీక్షించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రొటీన్ విలువలు కలిగిన పౌష్టికాహారం అందజేస్తున్నారన్నారు. అనంతరం ఎంపీటీసీ సభ్యురాలు అనురాధ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం విద్యార్థులకు పౌష్టికాహారాన్ని వడ్డించాలని ఆమె సూచించారు.

### గురుకుల పాఠశాల తనిఖీ

**పెనుగొండ:** రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు బూసి వినీత బుధవారం పెనుగొండలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖీ నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. మెనూ ప్రకారం భోజనం ఏర్పాటును పరిశీలించారు. కిచెన్, బాత్రూంలను, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. అన్నం మరీ మెత్తగా ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రణాళికా బద్ధంగా అభ్యాసం, అవగాహన కల్పనపై ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి,ప్రిన్సిపాల్ ఎస్తేరు రాణి వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

### అరుణాచలానికి ప్రత్యేక బస్సులు

**నరసాపురం:** నరసాపురం డిపో నుంచి అరుణాచల యాత్రకు ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సుబ్బన్నరెడ్డి బుధవారం విలేకరులకు చెప్పారు. ఈ నెల 3, 8, ఏప్రిల్ 4, 7, మే 3, 6, జూన్ నెల 2, 5వ తేదీల్లో సూపర్ లగ్జరీ బస్సులు శ్రీ కాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా అరుణాచలం వెళతాయని చెప్పారు. బయలుదేరిన బస్సు 3 రోజుల తరువాత తిరిగి చేరుకుంటుందని వివరించారు. రాత్రి 7 గంటలకు బస్టాండ్ నుంచి బయలుదేరుతాయని చెప్పారు. చార్జీ రూ.2600 లుగా నిర్ణయించినట్టు చెప్పారు. రిజర్వేషన్ సౌకర్యం ఉందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### లూథరన్ చర్చిలో డెలిగేట్ల ఎంపిక

**మొగల్తూరు:** స్థానిక పాలపర్తివారిపేటలోని లూథరన్ చర్చిలో బుధవారం ప్యారిస్1లో డెలిగేట్స్ ఎంపిక నిర్వహించారు. మొగల్తూరు, కోమటితిప్ప, దారితిప్ప, కాళీపట్నం గ్రామాలకు చెందిన డెలిగేట్స్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొగల్తూరుకు చెందిన మైలాబత్తుల సామ్యూల్ జాన్ డెలిగేట్‌గా, ఆల్టర్నేట్ డెలిగేట్‌గా కోమటితిప్పకు చెందిన పైడి రత్నంరాజులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రెవరెండ్ గోడి ఏసుబ్ రాజు, పిట్టా థామస్, మేడిది బాబూరావు, జయరాజు, వెంకటేశ్వర్లు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీకృష్ణ ఎమర్జెన్సీ క్లినిక్ ప్రారంభం


శ్రీ కృష్ణా ఎమర్జెన్సీ ఆస్పత్రిని ప్రారంభిస్తున్న దృశ్యం

**పెనుమంట్ర:** మార్టేరులో ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథరామారెడ్డి ఎంఎస్ (యశోదా హాస్పటల్స్, హైదరాబాద్) చేతుల మీదుగా శ్రీ కృష్ణ ఎమర్జెన్సీ క్లినిక్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవజ్ఞులైన వైద్యులు డాక్టర్ పులగం కళ్యాణ్ రెడ్డి (ఎంఎస్), డాక్టర్ పులగం హనూషారెడ్డి (ఎంబీబీఎస్) ఆధ్వర్యంలో ఉత్తమ వైద్య సేవలు అందుతాయన్నారు. అత్యవసర వైద్యం అందిస్తారన్నారు.

### కొప్పర్రులో దుర్గమ్మ జాతర

**నరసాపురం రూరల్:** మండలంలోని కొప్పర్రులో ఉన్న శ్రీ దుర్గమ్మ అమ్మవారికి బుధవారం అష్టోత్తర కలశ పంచామృత స్నపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటలకు నిర్వహించిన ఉయ్యాల సేవ కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారికి నైవేథ్యాలు సమర్పించారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న గ్రామానికి చెందిన ఆడపడచులు సైతం అమ్మవారికి నైవేథ్యాలు సమర్పించారు. రాత్రి బాణసంచా కాల్పులతో జాతర మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఉత్సాహంగా రామాలయ పునఃప్రతిష్ఠాపనోత్సవాలు

**నరసాపురం:** పట్టణంలో 120 ఏళ్ల చరిత్ర ఉన్న శ్రీ కోదండ రామాలయం పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా జరుగతున్నాయి. బుధవారం ఎస్ఆర్ఐ కొవ్వలి యతిరాజ రామ్మోహన్‌నాయుడు, శిరీష దంపతుల ఆధ్వర్యంలో విష్వక్సేన పూజ, పుణ్యావచన, ఈంకారీదులు, అష్టాసీతుల తదితర పూజలు నిర్వహించారు. శ్రీ ఆదిపాశక్తి నృత్య నికేతనం విద్యార్థుల కూచిపూడి నృత్యాలు అలరించాయి. ఈ సందర్భంగా త్రిదిండి శ్రీరామ చంద్ర రామానుజ జీయర్ స్వామి ఆధ్యాత్మిక ప్రవచనాలు వినిపించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చేగొండి రామకృష్ణ, పాలంకి వరప్రసాద్, కోటిపల్లి ఆనందరావు, నంద్యాల బాబు, అధికారి సతీష్, కోటిపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

# వరిచేలల్లో కాలిబాటలతో అధిక లాభం

రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు


సాగులో ఉన్న వరిచేను

**యలమంచిలి:** వరి చేను ఊడ్చిన తరువాత పొలంలో ప్రతి రెండు మీటర్లకు కాలిబాట వేయడం వలన రైతులకు అధిక ప్రయోజనం ఉంటుంది. పైరు వేరు భాగానికి విస్తారంగా గాలి, సూర్యరశ్మి తగలడం, చీడ, పీడల సమస్య తగ్గడం, ఎరువులు, పురుగు మందులు చల్లే సమయంలో దారి సమస్య తగ్గడంతోపాటు ప్రతి ఎకరాకు మూడు, నాలుగు బస్తాలు అదనంగా పండి రైతులకు లాభాన్ని కలగజేస్తుంది. గతంలో చాలామంది రైతులు కాలిబాటలు వేయడం అదనపు ఖర్చుగా భావించి ఆసక్తి కనపరిచే వారు కాదు. వ్యవసాయాధికారులు కాలిబాటల ప్రయోజనాన్ని రైతులకు విస్తృతంగా వివరించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

**కాలిబాటలు వేసే విధానం..**

కాలిబాటలు వేసే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. ప్లాస్టిక్ లేదా డొక్కతాడు తీసుకుని చేను గట్టు అవతలి వైపు నుంచి ఇవతలి వైపు వరకు బాగా సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెంటీమీటర్లు వెడల్పున వరి నాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్న ప్రదేశంలో నాటుకోవాలి. వెదజల్లే పద్ధతిలో సాగు చేస్తే విత్తనాలు చల్లిన తరువాత 15 నుంచి 20 రోజుల వ్యవధిలో కాలిబాటలు వేసుకోవాలి.

**ప్రయోజనాలెన్నో..**

కాలిబాట వేయడం వలన పైరు మొదళ్లకు గాలి, వెలుతురు, సూర్యరశ్మి విస్తారంగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకు తగ్గుతుంది. కాలిబాట మార్గంలో వెళ్లి కలుపు తొలగించడానికి, మందులు చల్లడానికి వీలు కలుగుతుంది. తెగుళ్లను సులభంగా గుర్తించడానికి, సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి ఎలుకలను నివారణకు వీలవుతుంది. తుఫాన్‌లు, భారీ వర్షాలు వంటి ప్రకృతి విపత్తులు ఏర్పడిన సమయంలో పైరులో కిరణజన్య సంయోగ క్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి తగ్గకుండా ఉంటుంది. పైరులో చీడ పీడల ఉధృతిని దగ్గరగా గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది.

**కాలిబాటలతో అధిక దిగుబడి..**



ఒక ఎకరం పొలంలో కాలిబాటలు వేయడానికి సుమారు రూ.800 ఖర్చు అవుతుంది. కాని కాలిబాటలు వేయడం వల్ల నాలుగు బస్తాల వరకు అధిక దిగుబడి రావడమే కాకుండా పంట కాలంలో చేను మొత్తం తిరగడానికి అనువుగా ఉంటుంది. దీనిపై మా సిబ్బందితో రైతులకు అవగాహన కల్పించడంతో ఇప్పుడు రైతులంతా కాలిబాటలు వేస్తున్నారు.

చిందులూరి దేవి,
మండల వ్యవసాయాధికారి, యలమంచిలి

## రైతులకు అండగా సీఎం జగన్


శ్రీరంగనాథరాజుకు ఎండ్ల బండి మెమెంటోను అందిస్తున్న నాయకులు

**పెనుగొండ:** రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి రైతుకూ అండగా నిలిచి వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. రైతులఖాతాల్లో రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేసినందుకు కృతజ్ఞతగా బుధవారం తూర్పుపాలెంలోని కార్యాలయంలో పలువురు నాయకులుమాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు ఎడ్లబండి మెమెంటోను అందించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆచంట మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారాం, ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, సిద్ధాంతం ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, పి.వనమరాజు పాల్గొన్నారు.

# సర్వే పారదర్శకంగా ఉండాలి


మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ నవీన్

**మొగల్తూరు:** సుస్థిర అభివృద్ధి, లక్ష్యాలపై చేపట్టిన సర్వే పారదర్శకంగా ఉండాలని ఈఓపీఆర్డీ నవీన్ కిరణ్ సూచించారు. ఎస్‌డీజీ (సస్టేయిన్‌బుల్ డెవలప్‌మెంట్ గోల్) సుస్థిర, అభివృద్ధి లక్ష్యాలు అనే అంశంపై బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారులు ఎనిమిది అంశాలపై సర్వే చేయించాలని సూచించారని కార్యదర్శులు, వలంటీర్లు, సంక్షేమ శాఖ సహాయకులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఏఎన్ఎం, ఆశ వర్కర్లు, సర్వేలో పాల్గొనాలన్నారు. రక్తహీనత కలిగి ఉన్న 19 సంవత్సరాల వయస్సు ఉన్న కౌమార దశలో ఉన్న ఆడపిల్లల వివరాలు, రక్తహీనత కలిగి ఉన్న గర్భిణుల వివరాలు, 5 సంవత్సరాల లోపు ఉన్న కుంగిపోయిన పిల్లల వివరాలు, ప్రాథమిక విద్యలో 1 నుంచి 8వ తరగతి వరుకు ఉన్న విద్యార్థుల వివరాలు, ఉన్నత విద్యలో ఇంటర్ విద్యార్థు1ల వివరాలుతో పాటు మధ్యలో చదువు మానేసిన విద్యార్థుల వివరాలను సేకరించి ఎప్పటికప్పుడు ప్రత్యేక యాప్‌లో నమోదు చేయాలని సూచించారు.

# సంక్షేమమే సీఎం జగన్ ధైర్యం


కోడేరులంక పల్లెపాలెంలో సంక్షేమాన్ని వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

**పెనుగొండ:** పెనుగొండ రాష్ట్రంలో పేదలకు అందించిన సంక్షేమమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధైర్యమని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. బుధవారం ఆచంట మండలం కోడేరులంక పల్లెపాలెం, పందేవారిపాలెం, పుచ్చలంక, నేతల వారిపేట, ఠాకేవారిపేట, నక్కిలంక, రావిలంకల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. రాష్ట్రంలో ఏ ఇతర పార్టీ నాయకుడుకి లేని ధైర్యం, దమ్ము సీఎం జగన్‌కు ఉన్నాయన్నారు. దీంతో ఎవరితోనూ జతకట్టకుండా ఒంటరిగా 175 నియోజకవర్గాల్లోనూ ప్రజల మద్దతుతో సీఎం జగన్ పోటీ చేస్తున్నారన్నారు. టీడీపీ, జనసేనలకు పోటీ చేసే ధైర్యం లేక పొత్తులంటూ వెంపర్లాడుతున్నాయన్నారు. రాష్ట్రంలో పారదర్శకంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ పార్టీలకతీతంగా అందించిన సంక్షేమ పథకాలు శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. చంద్రబాబు మాత్రం ఏనాడు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. సంక్షేమం అందుకున్న ప్రతీ గడపా సీఎం జగన్‌కు అండగా నిలవాలని, మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి కృష్ణవేణి పార్టీ నాయకులుడు గుడాల శ్రీను, కడలి వెంకటరెడ్డి, కంచుస్థంభం శ్రీను, అడ్డాల గంగారాజు, మానుకొండ సత్యనారాయణ, కొప్పాడి సత్యనారాయణ, గొల్లపల్లి బాలకృష్ణ, నేతల సంజీవరావు, కంచుస్థంభం అబ్బులు, నేతల నాని, యడ్ల రాంబాబు, నేతల శ్రీను, దేవరపు సూర్యనారాయణ,మొల్లేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**స్థలదాతలు అభినందనీయులు**

**పెనుగొండ:** ములపర్రులో వాసవీ సంఘ కల్యాణ మండప నిర్మాణానికి సహకరించిన, స్థలాన్ని అందించిన దాతలు అభినందనీయులని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. ములపర్రులో పెనుగొండకు చెందిన జమిందారు నూలి వెంకట సుబ్రహ్మణ్యం, కుమారులు అందించిన స్థలంలో నిర్మించిన వాసవీ సంఘ కల్యాణ మండప ప్రారంభోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి కల్యాణ మండపాలు నిర్మాణం వలన గ్రామీణులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో వాసవీక్లబ్ ఇంటర్‌నేషన్ మాజీ అధ్యక్షుడు నూలి వెంకట రమణమూర్తి, నూలి తాతాజీ, నూలి ధీరజ్, నార్కడమిల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# సదాశివమూర్తికి సన్మానం


సదాశివమూర్తిని సన్మానిస్తున్న క్షీరారామలింగేశ్వర మెకానిక్ సంఘ సభ్యులు

**పాలకొల్లు సెంట్రల్:** ఆస్ట్రేలియా యూనివర్శిటీ ఇచ్చిన అవార్డుకన్నా స్థానికంగా మిత్రులు చూపిస్తున్న ఆదరణ మాటల్లో చెప్పలేనిదని చైతన్య కృత్రిమ అవయవ కేంద్రం వ్యవస్థాపకులు వేదాంతం సధాశివమూర్తి అన్నారు. ఇటీవల ఆస్ట్రేలియా యూనివర్శిటీ అందించిన ఫ్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డు గ్రహీత సదాశివమూర్తిని బుధవారం పట్టణ శ్రీ శ్రీ క్షీరారామలింగేశ్వర మోటర్ సైకిల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సదాశివమూర్తి 40 ఏళ్ల క్రితం ప్రమాదంలో రెండుకాళ్లు కోల్పోయానని, తర్వాత 24 ఏళ్ల క్రితం పట్టణంలో చైతన్య కృత్రిమ అవయవ కేంద్రాన్ని ఏర్పాటు చేశానన్నారు. తక్కువ ధరలకు లేదా దాతల సహకారంతో అనేక మందికి కృత్రిమ కాళ్లు అందిస్తున్నామన్నారు. తాను తయారు చేసిన కృత్రిమ అవయవాలను ఫేస్‌బుక్‌లో పెడుతుంటానని తెలిపారు. నా పేస్‌బుక్‌లో పోటోలను సేకరించిన ఒక వ్యక్తి ఆస్ట్రేలియా యూనివర్శిటీకి పంపించాడన్నారు. తన సేవలను గుర్తించిన ఆస్ట్రేలియా యూనివర్శిటీ ఆస్ట్రేలియా రావాలని కోరారు. అంత దూరం రాలేనని చెప్పడంతో గత నెల 5న ఢిల్లీలో ఫ్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును అందజేశారన్నారు. ఈ అవార్డు అందుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో చేగొండి సూరిబాబు, మెకానిక్ సంఘ అధ్యక్షులు మైగాపుల రాంబాబు, గౌరవ అధ్యక్షులు కొశెట్టి చంటి, సెక్రటరీ బొర్రా దుర్గారావు, వైస్ ప్రెసిడెంట్ మోర్త నాగేశ్వరరావు, అబ్దుల్ రవూఫ్, జాయింట్ సెక్రటరీ నాగరాజు, కొశెట్టి రాజు, మోర్త గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓటు హక్కు వినియోగంపై అవగాహన


ఎమ్మెల్సీ ఓట్ల ప్రక్రియపై అవగాహన కల్పిస్తున్న జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, చిత్రంలో వంకా రవీంద్రనాథ్

**పాలకొల్లు అర్బన్:** శాసన మండలి ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న తనతో పాటు వంక రవీంద్రనాథ్‌కి మొదటి రెండు ప్రాధాన్యత ఓట్లు వేయాలని జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో పోడూరు, యలమంచిలి, పాలకొల్లు మండలాల ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కవురు శ్రీనివాస్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణం తీర్చుకునే అవకాశం ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు లభించిందన్నారు. వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి తమ విజయానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. అలాగే ప్రతిపక్ష పార్టీలు ఎంపీటీసీ సభ్యులను ప్రలోభాలకు గురి చేయడానికి, అయోమయానికి గురి చేస్తుంటారని, వారిని పట్టించుకోవద్దని చెప్పారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన తరువాత తాను పాలకొల్లులోనే ఉంటానని, ఇక్కడ నుంచే తన ప్రాతినిధ్యం ఉంటుందన్నారు. 2024లో పాలకొల్లులో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని గెలిపించి సీఎం జగన్‌కి బహుమతిగా ఇవ్వాలని పిలుపు నిచ్చారు. మరో ఎమ్మెల్సీ అభ్యర్థి, పారిశ్రామికవేత్త వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ బ్యాలెట్ పేపరులో వైఎస్సార్ సీపీ తరపున పోటీ చేస్తున్న కవురు శ్రీనివాస్, తన పేరు ఉంటాయని, పేర్లకి ఎదురుగా బాక్స్ ఉంటుందన్నారు. బాక్స్‌లో కేవలం, 1, 2 అని అంకెలు మాత్రమే వేయాలని సూచించారు. అలాగే పోలింగ్ ఆఫీసర్ ఇచ్చే పెన్ను మాత్రమే వాడాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, ఎంపీపీలు చిట్టూరి కనకలక్ష్మి, రావూరి వెంకటరమణ, సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, వైస్ ఎంపీపీలు పడవల సునీల్‌బాబు, గొల్లపల్లి శ్రీనివాసరావు, గుబ్బల సత్యనారాయణ, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, డీటీడీసీ బాబు, కోఆప్షన్ మెంబర్ తండా ఇస్సాక్‌రాజు, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, పార్టీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, మండల సచివాలయ కన్వీనర్ పార్శ్వి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి


పెనుగొండ ఎస్‌వీకేపీలో యాంటీ డ్రగ్ అవగాహన సదస్సులో సీఐ సత్యవతి

**పెనుగొండ:** మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని, మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ ఆర్.సత్యవతి అన్నారు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో నిర్వహించిన యాంటి డ్రగ్ అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి స్థాయిలో చెడు అలవాట్లుకు బానిసయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, ఎలాంటి సమాచారం అందినా సత్వరం అధికారులకు తెలపాలన్నారు. దీనికోసం కళాశాలలో యాంటి డ్రగ్ కమిటీ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి కె.చిరంజీవి, ఎన్ఎస్ఎస్ అధికారులు ఆర్ఎన్ శ్రీనివాస్, పి.మీరయ్య, టి.దివాకర్, తెలుగు అధ్యాపకులు కె.సురేష్ బాబు పాల్గొన్నారు.

## నియోనెటల్ అంబులెన్స్‌పై అవగాహన


ఆచంటలో నియోనెటల్ అంబులెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

**పెనుగొండ:** నవజాత శిశువులకు రాష్ట్రంలో అత్యాధునిక వైద్య పరికరాలతో ప్రారంభించిన నియోనెటల్ అంబులెన్స్‌లు ప్రాణదాతలుగా నిలుస్తాయని ఆచంట సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జింతేంద్ర అన్నారు. బుధవారం ఆచంట సీహెచ్‌సీ వద్ద నియోనెటల్ అంబులెన్స్‌పై అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. వీటిలో చిన్నారుల వైద్యం కోసం వెంటిలేటర్, ఇంక్యుబెటర్, మానిటర్, ఇన్ఫ్యూజన్ పంప్ వంటి సదుపాయాలు ఉంటాయన్నారు. నెలలు నిండక మునుపు పుట్టే పిల్లలకు, తక్కువ బరువు ఉండే పిల్లలకు, తమంతట తాము శ్వాస తీసుకోలేని పరిస్థితుల్లో కృత్రిమ శ్వాస అందించడానికి, శిశువు ఆరోగ్య స్థితిని గమనించడానికి మానిటర్ ఉండడంతో పాటు ప్రాణాలను నిలపడానికి అత్యాధునిక పరికరాలు ఉంటాయన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ రమ్యశ్రీ, డీఎం గణేష్, ఓఈ రాజు, రాధిక, రామారావులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ


శేరేపాలెం గామంలో దివ్యాంగురాలికి పింఛన్ అందిస్తున్న సచివాలయ ఉద్యోగి


మేడపాడులో పొలం వెళ్తున్న రైతుకు పింఛన్ అందిస్తున్న దృశ్యం

**మొగల్తూరు:** మండలంలోని 21 సచివాలయాల పరిధిలో సుమారు 80 శాతం పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ ఆర్‌సి ఆనంద్ కుమార్ బుధవారం విలేకరులకు తెలిపారు. మండలంలో వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల తదితర పింఛన్ల లబ్ధిదారులు 8302 మంది ఉండగా 6641 మందికి పింఛన్ అందించామని పేర్కొన్నారు. శేరేపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగురాలు కుమ్మరిపురుగు నాగకు వేలిముద్రలు పడకపోవడంతో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్రమణ్యం పింఛన్ అందించారు.

**పాలకొల్లు వెళ్లి అందజేత**

**నరసాపురం రూరల్:** మండలంలోని కొత్తనవరసపురం గ్రామానికి చెందిన బొక్కే సుజాత అనారోగ్యంతో బాధపడుతూ గత పక్షం రోజులుగా పాలకొల్లు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతుంది. దీంతో ఈ నెల పింఛన్ తీసుకునేందుకు రాకపోవడంతో వలంటీర్ రాబిన్‌పాల్ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ జక్కం సుహాస్ సహకారంతో బుధవారం పాలకొల్లు వెళ్లి బొక్కే సుజాతకు పింఛన్ అందజేశారు.

**యలమంచిలిలో..**

**యలమంచిలి:** మండలంలోని అన్నిగ్రామాల్లో బుధవారం ఉదయం నుంచే వలంటీర్లు పింఛన్ అందించారు. గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ మొత్తం అందించారు. అనంతరం ప్రతి లబ్ధిదారుని యోగ క్షేమాలు తెలుసుకున్న గృహ సారథులు ప్రభుత్వ పనితీరును వివరించారు.

# నేటి నుంచి కల్యాణోత్సవాలు


పుష్పాలంకరణలో కనకదుర్గమ్మ

**పాలకొల్లు సెంట్రల్:** స్థానిక యడ్లబజారు సెంటర్‌లో ఉన్న శ్రీ కనకదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. మార్చి పదో తేదీ వరకూ తొమ్మిది రోజులు పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. యూవని వేంకట రామ చన్ద్రసోమయాజులు (ఘనాపాటి) బ్రహ్మత్వంలో కల్యాణ మహోత్సవ పూజా కార్యక్రమాలు జరపనున్నారు. గురువారం రాత్రి 7:15 గంటలకు అమ్మవారి ధ్వజారోహణము పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. శుక్రవారం రాత్రి 7:29 గంటలకు కనకదుర్గా మల్లేశ్వరస్వామివారి కల్యాణం, శనివారం మధ్యాహ్నం 2 గంటలకు అమ్మవారి పట్టణ ఊరేగింపు, ఆదివారం రాత్రి 7 గంటలకు ఊంజల్ సేవ, లక్ష దీపాలంకరణ, సోమవారం రాత్రి ధర్బారుసేవ, మంగళవారం ఉదయం పూర్ణాహుతి, దండాడింపు ఉత్సవం, త్రిశూలస్నానం రాత్రి 7 గంటలకు అమ్మవారికి లక్ష చామంతి పువ్వులతో పూజ, బుధవారం లక్ష పసుపు కొమ్ముల పూజ, గురువారం సాంస్కృతిక కార్యక్రమాలు, శుక్రవారం ఏకాంతసేవ, శ్రీపుష్పోత్సవం కార్యక్రమంతో ఉత్సవ కార్యక్రమాలు ముగించనున్నారు.

# కమ్మేస్తున్న డంపింగ్‌యార్డ్ పొగ


సూర్యతేజస్ నగర్ రోడ్డులో మంచులా కమ్మేసిన డంపింగ్ యార్డు పొగ

**పాలకొల్లు సెంట్రల్:** పట్టణాన్ని మంచులా కప్పేస్తున్న డంపింగ్ యార్డు పొగ. పట్టణంలో యడ్లబజారు సెంటర్, రామయ్యహాలు ప్రాంతాల్లో రెండు డంపింగ్ యార్డులు ఉన్నాయి. గత కొంత కాలంగా వీటి నుంచి పొగ వస్తూనే ఉంది. ఈ డంపింగ్ యార్డులో ప్లాస్టిక్‌తో పాటు మెడికల్ వ్యర్థాలు కూడా ఉండడంతో ఏ కారణం చేతనైనా ఈ చెత్త అంటుకుంటుంటే వచ్చే పొగవల్ల స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆస్తమా సమస్య ఉన్న పేషెంట్లు తీవ్రమైన అనారోగ్యానికి గురవుతున్నారు. ఎవరికి చెప్పినా చేసేది లేక ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. రెండు డంపిగ్ యార్డుల్లో చెత్త కొండల్లా పేరుకుపోవడంతో వాహనాలు పైకి ఎక్కే పరిస్థితి లేక దారిలోనే వేసేస్తుండడంతో రోడ్డుపైకి వచ్చేస్తుంది. ఈ పొగ మంగళవారం రాత్రి ముచ్చర్లవారి తోట, సూర్య తేజస్ నగర్, త్సవటపల్లి వారి తోట, కొండాలమ్మ గుడి, సుబ్బారాయుడు గుడి, బుధవారపు వీధి, కరణాల వీధి, అచ్చుగట్లపాలెం, బ్యాంక్ కాలనీ, చిత్రావి చెరువు గట్టు, మారుతి సెంటర్ ప్రాంతాలకు పొగ విస్తరించడంతో స్థానిక ప్రజలు ముందుగా మంచు అనుకుని లైట్‌గా తీసుకున్నారు. కాసేపు పీల్చే సరికి పొగ అని తేలండంతో ఎక్కడి నుంచి వస్తుందోనని ఆరా తీసుకుని ఇంటి తలుపులు వేసుకుని ఇళ్లకే పరిమితమయ్యారు. ఫైర్ ఇంజన్ల సహకారంతో రెండు డంపింగ్ యార్డుల్లోనూ కనీసం ఓ వారం రోజులు పాటు తడిపితేనే గాని ఈ పొగ ఆగదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మునిసిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి వేగంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంటుందని స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు.

## విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలి

**నరసాపురం:** పరీక్షల సమయంలో విద్యార్థులు ఒత్తిడికి దూరంగా ఉండాలని నరసాపురం ప్రభుత్వాసుపత్రి ఐసీటీసీ కౌన్సిలర్ జి.జేసుప్రసాద్ సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం శ్రీగౌతమి స్కూల్‌లో 10వ తరగతి విద్యార్థులకు మానసిక ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్.రాణి, ఫణికుమార్, మనస్విని, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.